క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు



పాల్తేరులో డ్రైనేజీలో పూడిక తీస్తున్న పంచాయతీ సిబ్బంది

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఈవోఆర్‌డీ సీహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం పాల్తేరులోని డ్రైనేజీల్లో పూడిక తీత పనులు చేపట్టినట్టు తెలిపారు. ప్రతి గ్రామంలోను డ్రైనేజీల్లో పూడికతీతను తీయించాలని, రోడ్డు పక్కన చెత్త కుప్పలు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించారు.

కొరుప్రోలు కళాశాలలో త్వరలో లెక్చరర్ల నియామకం

ఎస్.రాయవరం: మండలంలోని కొరుప్రోలులో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలో త్వరలో లెక్చరర్లను నియమించనున్నారని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సకురు సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో ఈ కళాశాల నిర్వాహణకు ఇప్పటికే అనుమతులు వచ్చాయన్నారు. ఎంపీసీలో 23 మంది, బైపీసీలో 21 మంది విద్యార్థులు జాయిన్ అయినట్టు చెప్పారు. ఒక్కో గ్రూపులో 40 సీట్లు చొప్పున ఉన్నాయన్నారు. తరగతులు ప్రారంభించే లోపు మిగిలిన ఖాళీలు భర్తీ అవుతాయని తెలిపారు. ఎస్.రాయవరం మండలంలో తొలిసారిగా జూనియర్ కళాశాల ప్రారంభ కావడం పట్ల పరిసర ప్రాంతాల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: దార్లపూడి 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం ఏటికొప్పాక ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా శనివారం ఏటికొప్పాకలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

రాంబిల్లి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో గల తొమ్మిది గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు కారణంగా రాంబిల్లి, వాడపాలెం, గోవిందపాలెం, కొత్తపేట, వాడనర్సాపురం, కొత్తపట్నం, కొప్పుగొండుపాలెం, చినకలవలపల్లి, పెదకలవలపల్లి గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసున్నట్టు పేర్కొన్నారు.

జీవాలకు గొంతువ్యాపు వ్యాధి నివారణ టీకాలు



పశువుకు హెచ్‌ఎస్ టీకాలు వేస్తున్న సాయికుమార్

కె.కోటపాడు: ఆర్నెళ్ల పైబడిన ఆవులు, గేదెల్లో గొంతువాపు వ్యాధి రాకుండా ఉండేందుకు హెచ్‌ఎస్ వ్యాక్సిన్ పశుసంవర్ధకశాఖ ద్వారా ఉచితంగా వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ తెలిపారు. శుక్రవారం ఎ.కోడూరులో 120 ఆవులకు, గేదెలకు హెచ్‌ఎస్ వ్యాక్సిన్ వేశారు. వర్షాకాలంలో ఆరుబయట లేత పచ్చ గడ్డిని పశువులు మేతగా తీసుకోవడం వల్ల బ్యాక్టీరియా సంక్రమించి గొంతు కింద వాపు వస్తుందన్నారు. ఈ వ్యాధి బారిన పడిన పశువులకు అధిక ఉష్ణోగ్రతతో కూడిన జ్వరం, నోటి వెంట నురుగ రావడం, మేత తక్కువగా తినడం, వంటి లక్షణాలు వస్తాయన్నారు. ఈ కారణాలతో పశువుల నుంచి పాల దిగుబడి తగ్గే అవకాశాలున్నట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు తప్పనిసరిగా పశువులకు హెచ్‌ఎస్ టీకాలను ముందస్తుగా వేయించి వ్యాధి బారిన పడకుండా చర్యలను తీసుకోవాలని సూచించారు.

విజ్ఞానం.. వినోదం

- ఘనంగా ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు
- విజేతలకు బహుమతులు అందజేత

వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానంతో పాటు, వినోదాన్ని అందించేందుకు గత నెల నుంచి గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. ముగింపు కార్యక్రమాల్లో పలువురు మాట్లాడుతూ విజ్ఞాన సముపార్జనకు గంథ్రాలయాలు ఎంతో ఉపయోగపడతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పాయకరావుపేటలో బహుమతులు పొందిన విద్యార్థులు



వివిధ పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులతో యలమంచిలి పౌరసేవా సంఘం సభ్యులు

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన విజ్ఞాన వేసవి శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్ ఆచార్యులు అధ్యక్షతన నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.ఎస్. భవాని ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విజ్ఞాన వేసి శిబిరాలు సత్ఫలితాలిస్తున్నాయని చెప్పారు. రిసోర్స్ పర్సన్ సీతారామయ్య మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటూ మేధాశక్తిని పెంపొందించుకోవాలన్నారు. విజ్ఞాన శిబిరాలను నిర్వహించిన గ్రంథాలయాధికారి లక్ష్మణరావును అభినందించారు. ఈ వేసవి శిబిరంలో విద్యార్థులకు పలు అంశాల పై శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్‌లు ఎస్.సీతారామమూర్తి, వై.అచ్యుతరావు, ఎస్.టి. సీతారామమూర్తిని గ్రంథాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఆర్.వి.రత్నం, యోగా టీచర్ ప్రసాద్, సూర్యనారాయణ, తాళ్ళరావు తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని, తద్వారా ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని గణపర్తి సర్పంచ్ చదరం గణేష్‌నాయుడు తెలిపారు. మునగపాక, గణపర్తి శాఖా గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి విజ్ఞాన తరగతులు శుక్రవారంతో ముగిసాయి. ఈసందర్భంగా గణపర్తిలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతుల ద్వారా మేధాశక్తిని పెంచుకోవచ్చన్నారు. ఇటువంటి శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శాఖా గ్రంథాలయాధికారి లంబా అప్పలనరసమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాండ్రేగుల రామనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మునగపాక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు విశ్రాంత ఉపాధ్యాయులు పెంటకోట తులసీరావు, సీఆర్పీ అచ్యుతకృష్ణ తదితరులు బహుమతులు అందజేశారు. శాఖా గ్రంథాలయాధికారి ఎల్.వి.రమణ ఆధ్వర్యంలో శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది.

బాల్య దశ నుంచే విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

యలమంచిలి: చిన్నతనం నుంచి విద్యార్థులంతా విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా జీవితంలో అత్యున్నత ఫలితాలు సాధించగలుగుతారని యలమంచిలి పౌరసేవా సంఘం అధ్యక్షుడు పుల్లా వెంకటరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేసవి శిక్షణలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు దివంగత విశ్రాంత కలెక్టర్ ఐ.ఎస్.రావు కుమార్తె అనురాధ రూ.10 వేల ఆర్థిక సాయంతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వై.అప్పారావు, విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ ఆడారి పూరీ జగన్నాథం, కె.పాపారావు, సన్యాసిబాబు, షేక్ అబ్దుల్లా, కె.దుర్గారావు, సూరిబాబు, గ్రంథాలయాధికారి వి.ఆనంద్, గ్రంథాలయ సిబ్బంది నాగరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు కోరారు. శుక్రవారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలు కాకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి శిబిరాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరోజని, ఎంఈవో దేవరాయలు,అచ్యుతా స్కూల్ కరస్పాండెంట్ శేషగిరి, గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న గణపర్తి సర్పంచ్ గణేష్‌నాయుడు



యలమంచిలిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పౌరసేవా సంఘం సభ్యులు



అచ్యుతాపురంలో మాట్లాడుతున్న సీఐ బుచ్చిరాజు

కెనరా బ్యాంకు మేనేజర్‌కు సత్కారం



శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

రాంబిల్లి: మండలంలోని గోకివాడలో కెనరాబ్యాంకు మేనేజర్ శ్రీకాంత్‌ను శుక్రవారం గ్రామ పెద్దలు సత్కరించారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలందించిన శ్రీకాంత్ బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్.వి.సూర్యనారాయణ, ద్వారపురెడ్డి అప్పారావు, ద్వారపురెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుందరపును కలిసిన పూడిమడక మత్స్యకారులు



సుందరపును మర్యాద పూర్వకంగా కలిసిన పూడిమడక మత్స్యకారులు

అచ్యుతాపురం/మునగపాక: ఎమ్మెల్యేగా ఎన్నికైన సుందరపు విజయ్‌కుమార్‌ను అచ్యుతాపురం మండలం పూడిమడకకు చెందిన పలువురు మత్స్యకారులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తమ ప్రాంత సమస్యల్ని వివరించారు. సుందరపు విజయకుమార్‌ను మునగపాక మండల జనసేన, టీడీపీ,బీజేపీ నేతలు కలిశారు. మునగపాక గ్రామ ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, కృష్ణవేణి దంపతులు సుందరపును దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

10 నుంచి ఇంటింటికీ ధర్మ ప్రచారం



ఎస్.నర్సాపురంలో సమావేశమైన సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు



కొండకర్ల రామాలయంలో సమావేశమైన సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

పాయకరావుపేట: ఈ నెల 10 నుంచి 25 వ తేదీ వరకు ఇంటింటికీ ధర్మప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సమరసత సేవా ఫౌండేషన్ ఖండ సంయోజకులు నీలాపు వెంకటరెడ్డి తెలిపారు. ఎస్.నర్సాపురంలోని కృష్ణ మందిరంలో శుక్రవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ తాడి సూరిమూర్తి మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. గ్రామంలో ఉన్న ఆలయాల్లో ప్రతి వారం భజన, హారతి కార్యక్రమాలు జరిపించాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల ఉప కన్వీనర్లు పల్లేల జోగారావు, మేడిశెట్టి దివాణం, కట్టా వీరబాబు, నడిగట్ల శ్రీనివాసరావు, మంచాల రవి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఈ నెల 11 నుంచి 15 వరకూ ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహిస్తున్నట్టు సమరసత సేవా ఫౌండేషన్ యలమంచిలి ఖండ సంయోజకులు బి.వి. రమణ తెలిపారు. మండలంలోని కొండకర్ల రామాలయంలో శుక్రవారం నిర్వహించిన సమరసత సేవా ఫౌండేషన్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతి గ్రామంలోనూ దేవాలయం కేంద్రంగా భజనలు,నగర సంకీర్తన,పౌర్ణమి సామూహిక హారతి నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు,గుడివాడ రమణ, ఆడారి త్రినాథ్,చోడపల్లి సత్యం,కట్టమూరి శ్రీనివాసరావు తదితరలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించాలని ఆందోళన



పెదపాడు సచివాలయం ముందు ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

అచ్యుతాపురం: మండలంలోని పెదపాడులో వారం రోజులుగా నిలిపివేసిన గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉపాధి వేతనదారులు ఆందోళన చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేపట్టకపోవడంతో స్థానిక దళితులు,కౌలు రైతులు,కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే పనులు ప్రారంభించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు వంద రోజుల పనిదినాలను కచ్చితంగా కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సముద్రాలు, లక్ష్మి, అప్పలనర్సమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



కుల బహిష్కరణకు గురి చేశారంటూ వాపోతున్న బాధితులు దేముడు,చినతల్లి

మునగపాక: అన్నదమ్ముల మధ్య వివాదం కారణంగా శెట్టిబలిజ పెద్దలు తమను కుల బహిష్కరణకు గురి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు కుందిరి దేముడు, చినతల్లి దంపతులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ విషయమై ఎస్పీ, డీజీపీలకు ఫిర్యాదు చేయనున్నామని చెప్పారు. మండలంలోని టి.సిరసపల్లి శివారు రామారాయుడుపేటకు చెందిన కుందిరి దేముడు,చినతల్లి దంపతులు మేకలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దేముడు కుటుంబానికి సంబంధించిన అన్నదమ్ముల మధ్య 15 సంవత్సరాలుగా గొడవలు జరుగుతున్నాయి. దేముడు కుమారుడు పరదేశినాయుడును అడ్డం పెట్టుకుని వివాదాలు జరుగుతుండేవి.విషయం తెలుసుకున్న శెట్టిబలిజ కుల పెద్దలు రాము,రాజులు దేముడు కుటుంబ సభ్యులు ఉంటున్న ఇంటికి మూడు రోజుల క్రితం తాళం వేసి కుల బహిష్కరణ చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు మునగపాక పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి దేముడుకు ఇంటి తాళం తీసి వారికి రక్షణగా నిలిచారు. తరువాత రోజున మళ్లీ కుల పెద్దలు అదే ఇంటికి తాళం వేసి తమపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని అనకాపల్లి ఎస్పీ, డీజీపీల దృష్టికి తీసుకువెళతామని వారు తెలిపారు.

పలు గ్రామాల్లో నిలిచిన తాగునీటి సరఫరా

అవస్థలు పడుతున్న ప్రజలు



కొళాయిల నుంచి నీరు రాకపోవడంతో రేవుపోలవరంలో పైపుతో పడుతున్న గ్రామస్తులు

ఎస్.రాయవరం: పలు పంచాయతీల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మోటార్లు పనిచేయక తాగునీటి సరఫరా నిలిచిపోయినట్టు పలు గ్రామాల ప్రజలు తెలిపారు. రేవుపోలవరంలో ఆరు రోజులుగా, గుర్రాజుపేటలో ఐదు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని ఆయా గ్రామస్తులు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షం, ఈదురుగాలుల కారణంగా బంగారమ్మపాలెం సమీపంలో లైన్ దెబ్బతినడంతో విద్యుత్ సరఫరా సక్రమంగా చేయలేకపోతున్నామని ఆశాఖ సిబ్బంది తెలిపారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని వారు చెప్పారు.

విగ్రహాల ముసుగుల తొలగింపు



మెయిన్‌రోడ్డు పెరుగుబజార్ జంక్షన్ వద్ద దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగిస్తున్న జీవీఎంసీ ఉద్యోగులు

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగిసిన సందర్భంగా పట్టణ పరిధిలోని దేశ నేతలు, రాజకీయ నాయకుల విగ్రహాలు, శిలాఫలకాలపై ముసుగులు తొలగించే పనుల్లో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది నిమగ్నమయ్యారు. శుక్రవారం పట్టణంలోని పలు విగ్రహాల ముసుగులు తొలగించారు. ఈ ఏడాది మార్చి 16న దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిబంధనల మేరకు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసిన విషయం తెలిసిందే. కోడ్ ముగియడంతో విగ్రహాల ముసుగులను తొలగిస్తున్నట్లు అధికారులు చెప్పన్నారు.

భవిత కేంద్రాల్లో దివ్యాంగ పిల్లల నమోదు



దివ్యాంగ పిల్లలను నమోదు చేస్తున్న ఎంఈవోలు చిట్టిబాబు, కోటేశ్వరరావు

తుమ్మపాల: దివ్యాంగులైన పిల్లలకు ప్రభుత్వం సమగ్ర శిక్ష పాఠశాల, భవిత కేంద్రాల ద్వారా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు చిట్టిబాబు, కోటేశ్వరరావు తెలిపారు. మండలంలో దివ్యాంగులైన కె.గోవర్ధన్, షణ్ముఖప్రియ ఇళ్లకు వెళ్లి, వారిని భవిత కేంద్రంలో నమోదు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల(దివ్యాంగ) పిల్లల్ని సంబంధిత పాఠశాల, భవిత కేంద్రాలలో చేర్పించడం ద్వారా పిల్లల అభివృద్ధికి బాటలు వేసినవారవుతారని పేర్కొన్నారు. పాఠశాల, భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగ బాలలకు ప్రతి నెలా ఆర్థిక సాయం, ఉచిత వైద్య శిబిరం ద్వారా వారికి అవసరమైన వీల్‌చైర్, ట్రైసైకిల్, వినికిడి యంత్రాలు, బ్రెయిలీ కిట్స్ అందిస్తామన్నారు. పిల్లలకు సదరం, బస్‌పాస్, ట్రైన్ పాస్ తదితర సౌకర్యాలపై తల్లిదండ్రులకు ప్రతి నెల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తామన్నారు. 9, 10 తరగతుల పిల్లలకు జాతీయ ఉపకార వేతనం ద్వారా ఏడాదికి రూ.9 వేలు నుంచి రూ.11 వేలు అందుతాయన్నారు. మండలంలో కొత్తగా 37 మంది దివ్యాంగ పిల్లల్ని గుర్తించామన్నారు. మరింత సమాచారం కోసం భవిత కేంద్రం ఉపాధ్యాయులు ఎస్.ఏసురత్నం(92906 21485), సీహెచ్ రమాదేవి(77023 53781)లను సంప్రదించవచ్చన్నారు.

డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు

యలమంచిలి రూరల్: స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులు ప్రారంభించనున్నట్టు ప్రిన్సిపాల్ ప్రేమ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.బీఏ హిస్టరీ,బీఎస్సీ జువాలజీ కోర్సులకు కళాశాల విద్య కమిషనర్ నుంచి అనుమతి వచ్చిందన్నారు.ఇప్పటివరకు ఉన్న ఐదు కోర్సులకు ఇవి అదనమన్నారు.డిగ్రీ ప్రవేశాల కోసం ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమతుందని,విద్యార్థులకు అడ్మిషన్లకు సంబంధించిన సమాచారం ఇవ్వడానికి కళాశాలలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

మలేరియా అవగాహన ర్యాలీ



నర్సింగబిల్లిలో మలేరియా అవగాహన ర్యాలీలో వైద్య ఆరోగ్య సిబ్బంది

కశింకోట: మండలంలోని నర్సింగబిల్లిలో శుక్రవారం వైద్య సిబ్బంది మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా వ్యాధుల బారిన పడకుండా ప్రజల్ని చైతన్య పరిచారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ మాట్లాడుతూ దోమల వల్లే మలేరియా సోకుతుందన్నారు. దోమల కుట్టకుండా జాగ్రత్త వహించాలని కోరారు. దోమ తెరలు వాడాలన్నారు. వారానికి ఓసారి నిల్వ నీటిని పారబోసి, డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రసాద్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



వాసవీ కన్యకాపరమేశ్వరికి పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: జంపెనలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఆరో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమ పూజలు, క్షీరాభిషేకం నిర్వహించారు. కింతలి-గాదిరాయి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిది గ్రామాలకు చెందిన వాసవీ క్లబ్ మహిళలు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో చిన్నారులకు, మహిళలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వాసవీ జిల్లా గవర్నర్ వై. నరసింహరావు, ఉప గవర్నర్ మధు, వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్ శ్రీనాథు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. క్లబ్‌కు వంటపాత్రలు, గ్యాస్ స్టౌను గవర్నర్ నరసింహరావు అందజేశారు. స్థానికులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా మోహన్‌రావు పర్యవేక్షణలో నిర్వహించారు. కింతలి-గాదిరాయి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జునరావు, కార్యదర్శి అనపగడ్డ అప్పారావు, కోశాధికారి పుట్టా కొండలరావు, వైస్ ప్రెసిడెంట్ కొట్యాడ గున్నయ్యశెట్టి, జిల్లా కోశాధికారి అనపగడ్డ హరిబాబు, రావాల సతీష్, పుట్టా మురళీకృష్ణ, తవ్వా సన్యాసిశెట్టి, వాసవీ క్లబ్ సభ్యులు, వాసవీ వనిత సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలతో వాతావరణ కాలుష్య నియంత్రణ

- ఎంఈవో జానుప్రసాద్



గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంఈవో జానుప్రసాద్, గ్రంథాలయాధికారి వరలక్ష్మి

రోలుగుంట: మొక్కలు నాటి తద్వారా వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించాలని మండల విద్యాశాఖాధికారి జాను ప్రసాద్ తెలిపారు. స్థానిక గ్రంథాలయం, జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వేప, కానుగ, నేరేడు తదితర జాతుల మొక్కలను విద్యార్థులతో కలసి నాటారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మనం నాటిన మొక్కలు మనం విడిచిన కార్బన్‌డై-ఆక్సైడ్‌ను తీసుకుని ఆక్సిజన్‌ను విడుదల చేస్తుందన్నారు. ఆ ఆక్సిజన్‌నే మన ప్రాణవాయువు అన్నారు. విద్యార్థులు గమనించి తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటి వృక్ష సంపదను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వరలక్ష్మి, రోలుగుంట కాంప్లెక్స్ సీఆర్పీ పరవాడ సతీష్ పాల్గొన్నారు.